

# కామ్రేడ్ గణనాధ్ పాత్రోకి విప్లవ జోహార్లు

**విప్లవ** కమ్యూనిస్టు నేత కామ్రేడ్ గణనాధ్ పాత్రో 2020 జూన్ 6వ తేదిన అంతిమశ్వాస విడిచారు. ఆయన ఒడిషాకు చెందిన సీనియర్ నాయకులు. 80 సంవత్సరాల వయస్సులో అనారోగ్యంతో అయన మరణించారు.

మహత్తర నక్సల్బరి ఉద్యమ ప్రేరణతో, చేస్తున్న ఉద్యోగాన్ని వదలిపెట్టి కామ్రేడ్ గణనాధ్‌పాత్రో విప్లవోద్యమంలోకి ప్రవేశించారు. ఒడిషలోని అనేక ప్రాంతాలలో ఆయన పని చేసారు. మా నిర్మాణంలో చేరి అనేక సంవత్సరాలపాటు మా పార్టి నాయకులుగా కృషిచేసారు. కామ్రేడ్ జి.పి 1977లో ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత రూర్కెలా కేంద్రంగా తన కార్యకలాపాలను సాగించారు. రూర్కేలాలో స్థానిక సమస్యలపై పోరాడినందుకు అరెస్టు కాబడి బయటకు వచ్చారు. అదే సమయంలో బాలాసోర్ జిల్లాలో బలియాపాల్ వద్ద అణు క్షిపణి కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం పూనుకుంది.పార్టీ కేంద్ర కమిటీ నాయత్వాన కామ్రేడ్ జి.పి బలియాపాల్ అణు క్షిపణిస్థావర ఏర్పాటు వ్యతిరేక ఆందోళనలను ఒక గొప్ప ప్రజా ఉద్యమంగా మలచడంలో కీలక పాత్ర వహించారు.ఈ ప్రజాందోళన తీవ్రంగా సాగిన ఫలితంగా ప్రభుత్వం క్షిపణి కేంద్ర ఏర్పాటునుంచి వెనక్కు తగ్గింది. కామ్రేడ్ జి.పి 1982 నుంచి 2008 వరకూ సి.పి.ఐ (ఎం-ఎల్) పార్టీ కేంద్ర కమిటీ సభ్యులుగా కొనసాగారు. అప్పటికి ఆంధ్రప్రదేశ్ పార్టీ కమిటీ నాయకత్వాన విజయనగరం జిల్లాలో ప్రారంభమై కొనసాగుతున్న రైతు కూలీ, గిరిజనోద్యమ ప్రేరణతో బందుగాం, నారాయణపట్న ప్రాంతాలలోకూడా ప్రజా కదలిక మొదలైంది.అక్రమ సారా వ్యాపారానికి వ్యతిరేకంగానూ, భూమి కోసం, ఒడిషా రాష్ట్రంలోని ఆదివాసి భూమి హక్కులను గుర్తించే 2/56 అమలుకోసం, అటవీ హక్కులకోసం విస్తృతమైన ప్రజా ఉద్యమం సాగింది. ఈ ఉద్యమ క్రమంలో ఆదివాసులకూ,సాంఘికంగా దళితులుగా పరిగణించబడే పైడీ(SC)లనబడే వారికి మధ్య వచ్చిన సమస్యలపై ఏ వైఖరి తీసుకోవాలనీ; ఇది రెండు పీడితవర్గ సెక్షన్ల మధ్య వైరుధ్యంగా పరిగణించి పేదల మధ్య ఐక్యత సాధించే వైఖరి తీసుకొని ఉద్యమం దీర్ఘకాలం నిలబడేవిధంగా చేపట్టాల్సిన చర్యల పైనా ఇటు కేంద్ర కమిటీతో, అటు ఆంధ్రా, ఒడిషా రాష్ట్ర కమిటీలతో కామ్రేడ్ జి.పి విబేధించి, మా నిర్మాణం నుంచి వైదొలిగారు. ఆ తర్వాత క్రమంలో జైలులో నిర్బంధించబడి, బయటకు వచ్చిన తరువాత అనారోగ్యంతో ఇంటికి పరిమితం అయ్యారు. ఏమైనా కామ్రేడ్ గణనాధ పాత్రోతో మా అనుబంధం సుదీర్ఘమైనది. ఆ కామ్రేడ్ మరణానికి నివాళులు అర్పిస్తున్నాము. ఆయన కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సంతాపాలను తెలియచేస్తున్నాము.

**విశ్వం,** ప్రధాన కార్యదర్శి
**కేంద్ర కమిటీ, సిపిఐ (ఎం.ఎల్)**

oooo